నమస్తే తెలంగాణ

పెద్దపల్లి

5 | కరీంనగర్, శుక్రవారం 14 ఫిబ్రవరి 2025 | PEDDAPALLI

## యూరియా కోసం తిప్పలు

తిమ్మాపూర్, ఫిబ్రవరి13: యూరియా కొరతతో రైతులు ఇబ్బందులు పడుతూనే ఉన్నారు. తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ సొసైటీలో యూరియా బస్తాలు అందుబాటులో ఉన్నాయని రైతులకు సమాచారం రావడంతో గురువారం పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. అయితే సొసైటీకి 470 బస్తాలే రావడంతో కొంతమందికి దొరకలేదు. దీంతో కొందరు రైతులు ఆగ్రహించారు. తక్కువ బస్తాలు ఉన్నప్పుడు అందరికీ వచ్చేలా చూడాలని, పలుకబడి ఉన్నోళ్లకు ఇచ్చి మరికొందరికి ఇవ్వకపోవడం సరికాదని మండిపడ్డారు. అయితే అంతకుముందే బస్తాలకు డబ్బులు చెల్లించిన కొంతమంది రైతులకు నగదు రిటర్న్ చేశారు. కాగా, రైతులు ఆందోళన చెందవద్దని శుక్రవారం సరిపడా యూరియా అందుబాటులో ఉంటుందని సొసైటీ చైర్మన్ గుజ్జుల రవీందర్ రెడ్డి, సీఈవో ఆంజనేయులు సముదాయించడంతో రైతులు వెళ్లిపోయారు.

# బోనస్ పైసలేవి?





## సన్నరకం ధాన్యం అమ్మి రెండున్నర నెలలైనా అందని సాయం



జగిత్యాల కలెక్టరేట్ ఆవరణలో దమ్మన్నపేట రైతులు

### బోనస్ అందక దమ్మన్నపేట రైతుల దిగాలు

ధర్మపురి మండలం దమ్మన్నపేట గ్రామానికి చెందిన రైతులు సంప్రదాయ పద్ధతులకు భిన్నంగా వ్యవసాయం చేయడంలో పేరు గాంచారు. చాలా గ్రామాల్లో దొడ్డురకం వరిని పండిస్తుంటే.. వీరు మాత్రం సన్నరకం పండించేందుకే మొగ్గుచూపుతున్నారు. గ్రామంలో 1510 ఎకరాల సేద్యభూమి కాగా, గత వానకాలం 450 మంది రైతులు 1200 ఎకరాల్లో జై శ్రీరామ్ రకానికి చెందిన సన్నరకం సాగు చేసి, దాదాపు 28 వేల క్వింటాళ్ల ధాన్యాన్ని పండించారు. అందులో చాలా మంది పంట కల్లంలో ఉండగానే ఆసాములు, వ్యాపారులకు విక్రయించుకున్నారు. దాదాపు 250 మంది రైతులు మాత్రం బోనస్ వస్తుందన్న నమ్మకంతో కొనుగోలు కేంద్రానికి తెచ్చి దాదాపు 7వేల క్వింటాళ్లు విక్రయించారు. ఈ లెక్కన వీరికి ₹35 లక్షలు బోనస్ రూపేనా రావాల్సి ఉంది. దాదాపు రెండున్నర నెలలుగా ఎదురు చూస్తున్నా రాకపోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. విసిగి పోయి సోమవారం జగిత్యాల ప్రజావాణికి వచ్చి ఫిర్యాదు చేశారు. అప్పులు సప్పులు చేసి పంట పండించామని, యాసంగి పంట పెట్టుబడికి తిప్పలైతందని, దయ ఉంచి. తమ సన్నపడ్లకు బోనస్ పైసలు ఇప్పించాలని కలెక్టర్‌ను కలిసి వేడుకున్నారు.

### ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులకు చెల్లించాల్సిన బోనస్ వివరాలు

| జిల్లా | ధాన్యం కొనుగోలు (మెట్రిక్ టన్నులు) | చెల్లించాల్సిన బోనస్ (రూ.కోట్లలో) | చెల్లింపులు (రూ.కోట్లలో) | బకాయిలు (రూ.కోట్లలో) |
|---|---|---|---|---|
| పెద్దపల్లి | 2,29,443 | 114.72 | 89.12 | 25.60 |
| జగిత్యాల | 31,092 | 15.54 | 3.62 | 11.92 |
| కరీంనగర్ | 72,135 | 36.06 | 33.82 | 2.24 |
| రాజన్నసిరిసిల్ల | 61,605 | 30.802 | 29.55 | 1.24 |

### బోనస్ ఇస్తమంటేనే సన్నరకం వేసినం



క్వింటాల్‌కు ₹500 బోనస్ ఇస్తమని కాంగ్రెస్ ప్రభుత్వం మాట ఇస్తేనే సన్నరకం వేసినం. జైన సహకార సంఘం కొనుగోలు కేంద్రంలో ధాన్యం అమ్మి దాదాపు రెండు నెలలు దాటింది. ఇప్పటివరకు బోనస్ అందలేదు. నాకు ఎకరన్నర పొలం ఉన్నది. సన్నరకం సాగు చేసిన. 30 క్వింటాళ్ల వరకు సంఘం కేంద్రంలో అమ్ముకున్న. ₹15 వేల బోనస్ రావాల్సి ఉంది. రైతుభరోసా జమకాలేదు. కనీసం నాకు రావాల్సిన బోనస్ డబ్బులు ₹15 వేలు అందితే పెట్టుబడికన్నా అయితయ్.

**- మంతుర్తి భూమన్న, రైతు (దమన్నపేట)**

### ఇప్పటి వరకు దిక్కులేవు



సన్నరకాలకు బోనస్ ఇస్తమన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాటలకు నమ్మకం లేకుండ అయితుంది. బోనస్ డబ్బులు ఇప్పటి వరకు దిక్కులేవు. నాకున్న ఎకరన్నరలో సన్నరకం వేసిన. 40 క్వింటాళ్లు వస్తే రెండు నెలలకింద కొనుగోలు కేంద్రంలోనే అమ్మిన. 40 క్వింటాళ్లకు ₹20 వేల బోనస్ రావాల్సి ఉన్నది. ఇచ్చిన మాట ప్రకారం బోనస్ వెంటనే చెల్లించాలె.

**- జక్కుల లక్ష్మి, రైతు (దమ్మన్నపేట)**

- ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ₹41 కోట్లకు పైగా బకాయిలు
- ఎప్పటిలోగా చెల్లిస్తారో చెప్పని ప్రభుత్వం
- సుమారు 20వేల మంది అన్నదాతల ఎదురుచూపులు
- ఇటీవల జగిత్యాల ప్రజావాణిలో కలెక్టర్‌కు గోడు వెల్లబోసుకున్న దమ్మన్నపేట రైతులు
- చాలా గ్రామాల్లోనూ అదే దుస్థితి

**అధికారంలోకి రాగానే వడ్లు క్వింటాల్‌కు ₹500 బోనస్ చెల్లిస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిన కాంగ్రెస్, తీరా ఆ హామీని నెరవేర్చకుండా రెండు సీజన్లకు ఎగనామం పెట్టింది. పైగా మాట మార్చి 'సన్న వడ్లకే బోనస్' అంటూ వానకాలం సీజన్‌లో అమలు చేసింది. అయితే పాలకుల మాటలను నమ్మి సన్నాల దిగుబడులను కొనుగోలు కేంద్రాల్లో విక్రయించిన రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. రెండున్నర నెలలు దాటినా బోనస్ డబ్బులు రాక సుమారు 20వేల మంది రైతులు కండ్లు కాయలు కాసేలా ఎదురుచూస్తున్నారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోనే ఇంకా ₹41 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఎప్పుడిస్తారో తెలియక అధికారుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.**

జగిత్యాల, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ వరికి మద్దతు ధరతోపాటు క్వింటాల్‌కు ₹500 బోనస్‌గా ఇస్తామని మేనిఫెస్టోలో ప్రకటించిన విషయం తెలిసిందే. వరంగల్ డిక్లరేషన్‌లో రాహుల్‌గాంధీ సైతం వరికి బోనస్ ఇస్తామని చెప్పింది విధితమే. అయితే, అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వం వరికి బోనస్ ఇచ్చే విషయంలో కొర్రీలు పెట్టింది. దొడ్డురకం వరికి బోనస్ ఇచ్చేది లేదని, సన్నాలకు మాత్రమే ఇస్తామని చెప్పడంతోపాటు సన్న వడ్లుగా నిర్ధారించేందుకు సవాలక్ష ఆంక్షలు విధించింది. అయినా, వాటన్నింటిని దాటుకొని ఉమ్మడి జిల్లా రైతులు లక్షలాది ఎకరాల్లో సన్నరకం వడ్లు సాగు చేశారు. సేద్య జిల్లాగా ముఖ్యంగా, వరికి కేరాఫ్ అడ్రస్‌గా మారిన జగిత్యాల జిల్లాలో గత వానకాలం సీజన్‌లో 3.17 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, అందులో 85 వేల ఎకరాల్లో సన్నాలు పండించారు. అయితే ఈ జిల్లాలో మెజార్టీ శాతం ఒప్పంద పద్ధతిలో వేశారు. వానకాలం పంట ప్రారంభానికి ముందే పయనీర్, కావేరి, బేయర్, మహేంద్ర వంటి ప్రముఖ కంపెనీలతో పలువురు రైతులు క్వింటాల్‌కు ₹2600 నుంచి ₹2800 చెల్లించేలా ఒప్పందం కుదుర్చుకొని సన్నాలు సాగు చేశారు. ఒకవేళ ప్రభుత్వం ₹500 బోనస్ ప్రకటిస్తే.. ప్రతి క్వింటాల్‌కు అంత మొత్తంలో చెల్లించేందుకు అంగీకారం చేసుకున్నారు. 85వేల ఎకరాల్లో సగటున 2.14 లక్షల టన్నుల సన్నధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ, మార్కెటింగ్ శాఖ అధికారులు అంచనా వేశారు. తీరా చూస్తే ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల్లో కేవలం 30,092 టన్నులు మాత్రమే కొనుగోలు చేశారు. దిగుబడిని విక్రయించి దాదాపు మూడు నెలలు గడుస్తున్నా, ఇంత వరకు పూర్తిస్థాయిలో బోనస్ డబ్బులు అందకపోవడంతో రైతులు తీవ్ర నిరాశకు గురవుతున్నారు.

### రెంటికి చెడ్డ రేవడిలా..

వానకాలంలో బహిరంగ మార్కెట్‌లో సన్నరకం ధర క్వింటాల్‌కు ₹2,750 పలికింది. రేవంత్ సర్కారు మద్దతు ధరతోపాటు ₹500 బోనస్ కూడా ఇస్తామని చెప్పింది. ఈ నేపథ్యంలో వారి మాటలు నమ్మి కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం విక్రయించిన రైతుల పరిస్థితి రెంటికి చెడ్డ రేవడిలా మారింది. బహిరంగ మార్కెట్‌లో ఉన్న ధర దక్కక, బోనస్ అందక లబోదిబోమంటున్నారు. జగిత్యాల జిల్లాలో చూస్తే 31,092 టన్నుల సన్నధాన్యానికి క్వింటాల్‌కు ₹500 చొప్పున ₹15.54 కోట్లు చెల్లించాల్సి ఉండగా, ఇప్పటి వరకు కేవలం ₹3.62 కోట్లు మాత్రమే చెల్లించారు. మరో ₹11.92 కోట్లు చెల్లించాల్సి ఉండగా, అవి ఎప్పుడు వస్తాయో తెలియక రైతులు అధికారుల చుట్టూ తిరుగుతూనే ఉన్నారు. కనీసం ప్రభుత్వం ఎప్పుడిస్తుందో చెప్పడం లేదు, అధికారులకు స్పష్టత లేదు. మరోవైపు రైతుభరోసా కూడా ఇవ్వకపోవడంతో మళ్లీ అప్పుల కోసం వెంపర్లాడే దుస్థితి తలెత్తింది.

### సన్నాల సాగుకు కష్టాలు ఎక్కువ

దొడ్డురకం కంటే సన్నరకం సాగు చేయడానికి కష్టాలు ఎక్కువ. సహజంగా దొడ్డురకం పంటకాలం 135 రోజుల వరకు ఉంటే, సన్నవడ్లు 165 రోజుల వరకు ఉంటుంది. ఫలితంగా నెల రోజులు అదనంగా శ్రమించాల్సి వస్తుంది. పంటపెట్టుబడి సైతం పెరుగుతుంది. సాధారణ రకాలతో పోల్చిచూస్తే ₹4 వేల నుంచి ₹5 వేల వరకు అధికంగా అవుతుంది. అలాగే, సన్నాలకు నల్లకాటుక రోగం, దోమపోటు, మెడవిరుపు, సుడిదోమపోటు వంటి ప్రమాదకరమైన చీడపీడలు సోకే ప్రమాదమున్నది. అవి సోకితే పెట్టుబడి మరింత పెరుగుతుంది. అలాగే, దిగుబడి దొడ్డురకం ఎకరాన 29 నుంచి 30 క్వింటాళ్ల వరకు దిగుబడి ఉంటే.. సన్నరకం కేవలం 23 నుంచి 25 క్వింటాళ్లే వస్తాయని రైతులు చెబుతున్నారు. వ్యయప్రయాసాలకు ఓర్చి సన్నాలు సాగు చేసి విక్రయిస్తే.. రెండున్నర నెలలు గడిచినా బోనస్ డబ్బులు ఇవ్వకపోవడం అన్యాయమని ఆవేదన చెందుతున్నారు.

### బోనస్ ఇయ్యలే.. రైతు భరోసా రాలే..



నాకున్న నాలుగెకరాల్లో సన్నరకం వేసిన. 100 క్వింటాళ్లు వచ్చినయ్. 50 క్వింటాళ్లు షావుకారికి అమ్మిన. 50 క్వింటాళ్లు కొనుగోలు కేంద్రంలో అమ్మిన. ₹25 వేల బోనస్ రావాల్సి ఉంది. ఇప్పటి వరకు రాలేదు. మా ఊరు రైతులందరం కలిసి కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినం. ఎప్పుడు వస్తయా.. అని ఎదురు చూస్తున్నం. రైతు భరోసా కూడా రాలే.

**- పెంచాల రామన్న, రైతు (దమ్మన్నపేట)**

### బోనస్ రాలేదు.. రుణమాఫీ కాలేదు..



మాకున్న మూడున్నర ఎకరాల్లో సన్నరకం వేసిన. దాదాపు 50 క్వింటాళ్ల ధాన్యం కొనుగోలు కేంద్రంలో విక్రయించిన. ₹25 వేల బోనస్ రావాలి. ఇంతవరకు అందలేదు. రైతు భరోసా కూడా రాలేదు. ₹1.80 లక్షల రుణ మాఫీ కూడా కాలేదు. ప్రభుత్వాలు రైతులను ఇలా మోసం చేయడం మంచిది కాదు.

**- మైదం శ్రీనివాస్, రైతు, (దమ్మన్నపేట)**

## పంటలు ఎండుతున్నా పట్టదా..?

- సాగుకు నీరందక రైతన్న కంటతడి పెడుతున్నడు
- పెట్టుబడులు పెట్టాల్నా.. వద్దా.. అన్న సందిగ్ధంలో ఉన్నడు
- కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే స్పందించాలి
- మేడిగడ్డకు మరమ్మతులు చేపట్టి రిజర్వాయర్లు నింపాలి
- మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్



మాట్లాడుతున్న మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్‌కుమార్, పక్కన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి

సిరిసిల్ల టౌన్, ఫిబ్రవరి 13: రాష్ట్రంలో సాగునీరందక పంటలు ఎండిపోతున్నా, రైతన్న కంటతడి పెడుతున్నా కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏ మాత్రం పట్టింపులేదని మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ ధ్వజమెత్తారు. చాలాచోట్ల నీళ్లు వస్తయా.. రావా..? పంట చేతికి వస్తుందా.. లేదా..? అని తెలియక చాలా మంది రైతులు పెట్టుబడులు పెట్టేందుకు సందిగ్ధంలో ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వేసవి సమీపిస్తున్నందున ప్రభుత్వం వెంటనే స్పందించాలని, మేడిగడ్డ బరాజ్‌కు మరమ్మతులు చేపట్టి రిజర్వాయర్లు నింపి పంటలకు నీరందించాలని డిమాండ్ చేశారు. రైతుల పంటలకు సకాలంలో సాగునీరందించకపోతే సహించేదిలేదని హెచ్చరించారు. సిరిసిల్లలోని తెలంగాణ భవన్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తోట ఆగయ్య, పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణితో కలిసి ఆయన మాట్లాడారు. గోదావరి నదీ జలాల వినియోగానికి ఎత్తిపోతల ద్వారా తప్పితే ప్రత్యామ్నాయ మార్గం లేదన్నారు. యాసంగి పంట వేసిన రైతులు సాగు నీరు లేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. 1964లో శంకుస్థాపన చేసిన ఎస్సారెస్పీ 60ఏండ్లు గడిచినా ఆయకట్టుకు సరిపడా నీరందించలేదని, ఈ క్రమంలో కేసీఆర్ ప్రభుత్వం ఏర్పడిన వెంటనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని గుర్తు చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి ప్రాజెక్టుల నుంచి ఎత్తిపోతల ద్వారా, గ్రావెటీ కెనాల్ ద్వారా తెచ్చిన నీటితో యావత్ ఉత్తర తెలంగాణ జిల్లాలకు సాగు నీరందించారని చెప్పారు. దిగువ నుంచి ఎగువకు ఎత్తిపోసిన నీటిని సిరిసిల్లలోని ఎస్సారార్ రిజర్వాయర్ (మిడ్ మానేరు) నుంచి ఎత్తిపోతల ద్వారా రంగనాయకసాగర్, మల్లన్నసాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టులు నింపారని, పూర్వపు మెదక్, నిజామాబాద్, కరీంనగర్, వరంగల్, నల్లగొండ జిల్లాలకు నీరందించారని వివరించారు. మేడిగడ్డ బరాజ్‌లో ఒక బ్లాక్ కుంగితే రాజకీయం చేసిన రేవంత్‌రెడ్డి, అధికారంలోకి వచ్చి ఇంతకాలం గడుస్తున్నా ఇప్పటికీ నిర్మాణ పనులు ఎందుకు చేపట్టడం లేదో చెప్పాలన్నారు. చట్టం ప్రకారం నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ సూచనలు మాత్రమే చేస్తుందని, ప్రభుత్వమే మరమ్మతులు చేపట్టాల్సి ఉంటుందన్నారు. డ్యాం సేఫ్టీ అథారిటీ పేరు చెప్పి ఇప్పటికే 16 నెలల సమయాన్ని వృథా చేశాడని విమర్శించారు. తాను ఇటీవల గంభీరావుపేట, ముస్తాబాద్ మండలాల్లో పర్యటించిన సందర్భంలో రైతులు నారు పోసుకొని ఎరువులు చల్లారని, ఇప్పుడు నీళ్లు లేక తల్లడిల్లుతున్నారన్నారు. నీళ్లు వస్తాయా..? రావా..? తెలియని పరిస్థితుల్లో మళ్లీ యూరియా, డీఏపీ బస్తాలు చల్లితే ఏం జరుగుతుందోనని ఆందోళనలో ఉన్నారన్నారు. ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాలో రైతులతో మాట్లాడిన సమయంలో వారు పంటపై పెట్టుబడి పెట్టేందుకు సందిగ్ధంలో ఉన్నారన్నారు. గోదావరికి ప్రాణహిత, ఇతర నదుల ద్వారా వస్తున్న అనేక టీఎంసీల నీటిని సముద్రం పాలు చేయొద్దని కోరారు. ఎత్తిపోతల ద్వారా అన్నారం, సుందిళ్ల, ఎల్లంపల్లి ప్రాజెక్టులను నింపి మార్చి, ఏప్రిల్ లోగా రైతులకు నీరందించాలని డిమాండ్ చేశారు. రేవంత్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి రైతులను కాపాడుకునే దిశగా పనిచేయాలని సూచించారు. సాగునీరు సమృద్ధిగా ఇచ్చే అవకాశాలు ఉన్నాయని, ప్రభుత్వం ఆ దిశగా చొరవ తీసుకొని యాసంగి పంటకు పూర్తిస్థాయిలో సాగు నీరందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు బొల్లి రామ్మోహన్, న్యాలకొండ రాఘవరెడ్డి, కృష్ణారెడ్డి, కుంబాల మల్లారెడ్డి, గజభీంకార్ రాజన్న, ఎదురుగట్ల చంద్రయ్యగౌడ్, మాట్ల మధు, పడిగెల రాజు, మ్యాన రవి, విజయరామారావు, వేణుగోపాల్‌రావు, ప్రేమ్‌కుమార్, పోచవేని ఎల్లయ్యయాదవ్, కొక్కుల ఆంజనేయులు, గుజ్జె దత్తాద్రి తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్సీ బరిలో 71 మంది అభ్యర్థులు

- ముగిసిన ఉపసంహరణ
- రెండు స్థానాలకు 13 మంది విత్‌డ్రా
- పోటీలో పట్టభద్రుల స్థానానికి 56 మంది.. ఉపాధ్యాయ స్థానానికి 15 మంది
- ఇక హోరెత్తనున్న ప్రచారం

కరీంనగర్ కలెక్టరేట్, ఫిబ్రవరి 13 : కరీంనగర్– మెదక్– నిజామాబాద్– ఆదిలాబాద్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియలో ప్రధాన అంకం ముగిసింది. ఉపసంహరణకు గురువారం తుదిరోజు కాగా, రోజంతా ఉత్కంఠ కనిపించింది. మొత్తం 13 మంది విత్ డ్రా చేయగా, 71 మంది అభ్యర్థులు బరిలో ఉన్నట్టు తేలింది. ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు నామినేషన్లు స్వీకరించగా, పట్టభద్రుల స్థానానికి వంద మంది, ఉపాధ్యాయ స్థానానికి 17 మంది నామినేషన్లు దాఖలు చేశారు. పరిశీలన అనంతరం గ్రాడ్యుయేట్ స్థానం నుంచి 32 తిరస్కరించి 68 మంది నామినేషన్లు, టీచర్ స్థానం నుంచి ఒకటి తిరస్కరించి 16 మంది నామినేషన్లు ఆమోదించారు. గురువారం సాయంత్రం వరకు విత్‌డ్రాకు అవకాశముండగా, పట్టభద్రుల స్థానం నుంచి 12 మంది, ఉపాధ్యాయం స్థానం నుంచి ఒకరు ఉపసంహరించుకున్నారు. ఇక పట్టభద్రుల స్థానానికి 56 మంది, ఉపాధ్యాయ స్థానానికి 15 మంది బరిలో నిలిచారు. వీరంతా నేటి నుంచి ప్రచారాన్ని హోరెత్తించనున్నారు. ప్రధాన అభ్యర్థులంతా ఇప్పటికే రెండు విడుతలుగా ప్రచారం పూర్తి చేశారు. ఇప్పటినుంచి నేరుగా ఓటర్లను కలుస్తూ, ఓట్లు అభ్యర్థించేందుకు సిద్ధమయ్యారు.

## ఒక్క సిరిసిల్లలోనే పెండింగ్ ఎందుకు?



రాజన్న సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

కలెక్టరేట్, ఫిబ్రవరి 13: పెండింగ్ వేతనాల కోసం గ్రామ పంచాయతీ కార్మికులు పోరుబాట పట్టారు. జీపీ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి పాలడుగు సుధాకర్ ఆధ్వర్యంలో సుమారు 200 మంది గురువారం సిరిసిల్ల కలెక్టరేట్ ఎదుట భారీ ధర్నా చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఏ జిల్లాలో పెండింగ్‌లో పెట్టని ప్రభుత్వం, ఒక్క రాజన్న సిరిసిల్ల జిల్లాలోనే ఎందుకు ఆపివేశారని ప్రశ్నించారు. జూలై నుంచి ఉన్న బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యదర్శి సుధాకర్, జిల్లా కార్యదర్శి అన్నల్‌దాస్ గణేశ్ మాట్లాడారు. నెలల తరబడి కార్మికులకు వేతనాలు చెల్లించకపోవడంతో కుటుంబాలు ఇబ్బందులు పడుతున్నాయన్నారు. 15 రోజుల కింద పెండింగ్ వేతనాల కోసం నిధులు విడుదల చేసినా కేవలం డిసెంబర్ వేతనాలే ఇచ్చారని, జూలై నుంచి నవంబర్ వరకు ఇంకా పెండింగ్‌లోనే ఉన్నాయన్నారు. తమ ఆవేదనను కలెక్టర్ అర్థం చేసుకొని పెండింగ్ వేతనాలు ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. విధి నిర్వహణలో తమకు అవసరమైన సబ్బులు, నూనెలు, రక్షణ పరికరాలు అందించాలని కోరారు. ఈ మేరకు కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. ఇక్కడ సీఐటీయూ జిల్లా కార్యదర్శి కోడం రమణ, జీపీ యూనియన్ జిల్లా అధ్యక్షుడు మల్యాల నర్సయ్య, మండల అధ్యక్షులు బుర్ర శ్రీనివాస్, లోకిని శ్రీనివాస్, నర్సయ్య, అంజయ్య గౌడ్, మహేశ్, రాజశేఖర్, అనిల్ పాల్గొన్నారు.

## రేషన్‌కార్డు.. పరేషాన్!



- కొత్త కార్డుల మంజూరుపై గందరగోళం
- సర్కారు పూటకో మాటపై అయోమయం
- ప్రజాపాలన, గ్రామ సభల్లో దరఖాస్తుల స్వీకరణ
- తాజాగా మీసేవల్లో చేసుకోవాలని సూచనలు
- అస్పష్ట విధానాలతో ఆగమవుతున్న దరఖాస్తుదారులు
- మీసేవ కేంద్రాలకు బారులు

**కాంగ్రెస్ సర్కారు ప్రజలతో దాగుడు మూతలు ఆడుతున్నది. పూటకోమాట.. నెలకో కార్యక్రమం పేరిట దరఖాస్తులు స్వీకరిస్తూ, ఆగం చేస్తున్నది. రేషన్‌కార్డుల కోసం పరేషాన్ చేస్తున్నది. ఇప్పటికే పలుసార్లు అర్జీలు తీసుకున్న సర్కారు, కొత్తగా మళ్లీ మీ సేవ కేంద్రాల్లో చేసుకోవాలని సూచించడంతో గందరగోళం నెలకొన్నది. వారం కింద ఆప్షన్ ఇచ్చినట్టే ఇచ్చి 24 గంటలు కాకముందే క్లోజ్ చేయడం, మళ్లీ రెండ్రోజుల కింద అవకాశం ఇస్తున్నట్లు చెప్పడంతో దరఖాస్తుదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'అసలు ఎన్నిసార్లు నమోదు చేసుకోవాలి.. అప్లికేషన్లు ఇంకెన్ని చోట్ల ఇవ్వాలి' అని ప్రశ్నిస్తున్నారు.**



పెద్దపల్లి జిల్లాకేంద్రంలోని ఓ మీసేవ కేంద్రంలో దరఖాస్తుదారులు

పెద్దపల్లి, ఫిబ్రవరి 13 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రజాపాలన కింద పలు పథకాల కోసం దరఖాస్తులు స్వీకరించింది. అందులో కొత్త రేషన్‌కార్డుల కోసం జిల్లాలో దాదాపు 20వేల మంది అర్జీలు పెట్టుకున్నారు. వీటిని ఆన్‌లైన్‌లో ఎంట్రీ చేసిన అధికారులు, ఆ కొద్దిరోజులకే ఆ డాటాను పక్కనపడేసి సమగ్ర కుటుంబసర్వే ద్వారా వివరాలు సేకరించారు. 12,732 మందిని ఎంపిక చేశామని చెప్పారు. కానీ ఏ ఒక్కరికీ ఇవ్వలేదు. ఈ క్రమంలో రేషన్‌కార్డులు సహా నాలుగు పథకాల అమలు కోసం గత జనవరి 26 నుంచి నాలుగురోజుల పాటు గ్రామ సభలు నిర్వహించారు. కొందరి పేర్లు చదివి వినిపించారు. ఏమైందో ఏమో గాని మండలానికో పైలెట్ గ్రామంలో లాంఛనంగా ప్రారంభిస్తున్నట్లు చెప్పి జిల్లా వ్యాప్తంగా కేవలం 359 మందికి మాత్రమే కార్డులు పంపిణీ చేసి చేతులు దులుపుకొన్నారు.

### జిల్లాలో 35వేలపైనే అర్జీలు పెండింగ్

ఇటీవల నిర్వహించిన గ్రామ సభల్లో కార్డులు రాని వారు మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని సూచించడంతో కొత్త కార్డుల కోసం 25,182 మంది, మార్పులు, చేర్పుల కోసం మరో 10వేల మంది అర్జీలు పెట్టుకున్నారు. వీటిలో అర్హులైన వారి ఎంపిక కోసం డోర్‌టూ డోర్ సర్వే చేస్తామని ప్రకటించినప్పటికీ కార్యరూపం దాల్చలేదు. ఇదిలా ఉండగానే ప్రభుత్వం తాజాగా మరో కథ మొదలు పెట్టింది. మీసేవ కేంద్రాల్లో మళ్లీ అర్జీ పెట్టుకోవాలని చెప్పడంతో ప్రజలను గందరగోళంలో పడేసింది. ఎన్ని సార్లు దరఖాస్తులు చేసుకోవాలి? ఎన్ని చోట్ల అర్జీ పెట్టుకోవాలని మండిపడుతున్నారు. రోజుకో నిర్ణయం తీసుకుంటూ కాలయాపన చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రేషన్‌కార్డుల మంజూరీపై ప్రభుత్వానికి స్పష్టమైన విధానం లేకపోవడం వల్లే ఇలాంటి పరిస్థితి తలెత్తుతున్నదని మండిపడుతున్నారు. అయితే వారం క్రితం రేషన్ కార్డుల కోసం మీసేవ కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ప్రభుత్వం సూచించడంతో కేంద్రాల వద్ద బారులు తీరారు. కానీ, సైట్ 24గంటలు తిరగక ముందే మూసివేయడంతో నిరాశ చెందారు. తిరిగి సోమవారం నుంచి మీసేవ కేంద్రాల ద్వారా అప్లై చేసుకోవాలని ప్రకటించడంతో ప్రదక్షిణలు చేస్తున్నారు.

### ఎన్ని అర్జీలు పెట్టాల్నో అర్థమైతలేదు



నేను గతేడాదే పెళ్లి చేసుకున్న. కొత్త రేషన్ కార్డు కోసం ప్రజాపాలనలో దరఖాస్తు చేసుకున్న. కానీ కార్డు రాలె. మళ్లీ దరఖాస్తు చేసుకోవాలని చెబితే గత నెలలో చేసిన. ఇప్పుడేమో..? మీ సేవకు పొమ్మంటున్నరు. అసలు ఎన్నిసార్లు దరఖాస్తు చేసుకోవాలో అర్థమైతలేదు. ఏ ప్రభుత్వమైనా ఒకసారి దరఖాస్తు చేసుకుంటే అర్హులను గుర్తించి కార్డులు ఇస్తరు. వీళ్లేమో దరఖాస్తులతోనే సరిపెడుతున్నరు. మమ్ముల తిప్పించి ఇబ్బంది పెడుతున్నరు. ఇది సరికాదు. ప్రభుత్వం స్పందించి కొత్త కార్డులు ఇవ్వాలె.

**- బూడిద శివ సాయి, ఎక్లాస్‌పూర్ (మంథని మండలం)**